# గుడ్డి మాలోకం

**"కాశ్మీర్** కెళ్తున్నారు గదా ... నాకేం తెస్తారు ?" యమున చిలిపి కళ్లు చక్రాల్లా తిరిగిన్నై. హరీష్ కత్తెర మీసం కట్టును అలవోకగా నిమురుతూ అడిగింది. మూడేళ్ల క్రితం మూడుముళ్ళేసిన ఆరో అంటే ప్రాణం...

"నేనెల్తుంది హనీమూన్‌కు కాదోయ్. బార్డర్‌లో డ్యూటీకి. కాశ్మీరుకు వందల కిలోమీటర్ల అవతల కంటికి రెప్పలా దేశ సరిహద్దుల్ని కాపాడ్తూ గస్తీ తిరుగుతుండాలి. రాత్రింబవళ్లు మంచుకొండల్లో ఎగురుతూ మంచుపూలై పోవాలి..." యమున చెంప మీద చిటికేశాడు హరీష్. ఎందుకైనా మంచిదని సర్దిన సూటుకేసు తెరిచి చూశాడు. సివిల్ డ్రెస్సులతో పాటు చలి దుస్తులు... అన్నీ ఉన్నాయందులో ...

"వెరీ గుడ్. బెటరాఫంటే ఇలాగుండాలి. నా యమున బంగారు యమునా..." కౌగిట్లో బంధించాలని చేతులు ముందుకు చాచుకున్నై.

"అబ్బా... బంగారాన్ని కొరుక్కుతింటారా ?" భర్త అరచేతుల్ని చెంపలకు రాసుకుంటూ, "ఇది పట్టపగలు మహాశయా ! అత్తయ్య, మావయ్యలు బయట వెయిట్ చేస్తున్నారు తెలుసా!" గుర్తు చేసింది.

"అయితే ఏంటటా ?" మరో ప్రయత్నం.

యమున ఎదనిండా యమునా తరంగాలు దొర్లుతున్నై.

"ఛీ... చిలిపి. అంత పెద్ద సైనికాధిరి హరీష్ గారు... పెళ్ళాంతో ... ఇలాగేనా ?..." బుంగమూతి పెట్టి ఇంకేదో అనబోయింది. పెదాలు... పెదాలను మూసేసిన్నై, చేతులు నడుమును చుట్టేసిన్నై... ఓఫ్... తియ్యని అనుభవం... కమ్మని అనుభూతి.

"సరే... ఇప్పుడు నేనడుగుతున్నాను... కాశ్మీర్ నుండి వచ్చేప్పుడు నీకేం తేవాలి ?" తానే అడిగాడు.

ప్రశాంత యమున లాగున్న యమున అంతరంగమొకేసారి బ్రహ్మపుత్రలా దూకులాడ్తోంది. గందరగోళం తాలూకు ఛాయలు కళ్ళల్లో కదలాడి బిందురూపం దాల్చిన్నై.

"బార్డర్లో ఎప్పుడూ యుద్ధ వాతావరణమే గదా ! మీరు క్షేమంగా తిరిగి రావడమే నాక్కావాలి. అదే పదివేలు.." భర్త గుండెల మీద ఒరిగిపోయింది. చెక్కిన చెక్కిళ్ళ మీంచి దూకిన అశ్రుబిందువులు నేలమీద రాలి ముత్యాల్లా మెరిసి మాయమైపోతున్నై.

హరీష్ మనోసాగరము జాలి, ప్రేమ తరంగాలమయమైంది.

"పిచ్చి యమునా ! ఎయిర్ ఫోర్సు ఆఫీసర్‌ను ఏరి కోరి పెళ్ళి చేసుకున్న నువ్వేనా... ఇలా బేలగా ! నో ... ఆహార, నిద్ర భయమైథునంచ... అంటూ పశు పక్ష్యాదులకూ, మనిషికీ తేడాను వివరించిన నువ్వేనా... " తల నిమిరి చేతి గుడ్డతో కళ్లు అద్దాడు.

"అవును. నేనేనండీ ! మీరు లీవులో వచ్చి మూన్నెల్లైంది గదా ! మీ నీడలో ఉండడం అలవాటైంది. మీరు లేకుండా ఉండాలంటే... ఏవిటో... ఎంత అదిమి పెట్టినా గుండె పొంగులు ఆగడం లేదండి !" నల్లని కళ్ళల్లో తెల్లని మంచు తెర.

"ఇంకో ఏడెనిమిది నెలలైతే నువ్వు తల్లివై, నన్ను తండ్రిని చేస్తున్నావు గదా ! అప్పుడింత బెంగ ఉండదులే !"

సిగ్గులతో యమున బుగ్గలు రోజా మొగ్గలైపోయినై... రైలు స్టేషన్ క్యాంటిన్లో చాయ్ సిప్ చేస్తున్న ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ హరీష్ మనసు తెరమీద భార్యా, బాబుల దృశ్యం కదలాడ్తోంది. ఇప్పుడు బాబు, యమున ఏం చేస్తున్నారో !... రెండేళ్ళ తర్వాత మళ్ళీ సెలవులో వస్తూ... మధ్య స్టేషన్లో రైలు దిగి చాయ్ గ్లాసందుకోగానే తియ్యని ఇజ్ఞాపకాలు ముసురుకున్నై. చూపులు సీలింగ్ ఫ్యాన్ మీదున్నై...

రైలు కూత వినిపించలేదు.

చిన్న టౌన్లో పెద్ద రైల్వే ప్లాటుఫారమది. బయటి ఊళ్ళ నుండి వచ్చి ఊళ్ళో కెళ్లాలంటే ఆ దారి సౌకర్యంగా ఉంటుంది.

"ఏయ్ దొరా !" ఎవడో పిచ్చోడు హరీష్ వీపు మీద చరుస్తూ భళ్ళున నవ్వాడు. "నువ్వో పిచ్చోనివా ... ? మా ఊరి రైలు వోతుంది. నువ్వెక్కవా ?"

రైలు కదిలి వేగం పుంజుకుంటోంది.

"అరెరే... ట్రెయిన్... అయ్యో..." ఆందోళనగా పరుగెత్తాడు హరీష్. పరుగో పరుగు... రైలు వెంట రన్నింగ్‌రేస్ పరుగు... చివరి కంపార్ట్‌మెంట్ దగ్గరైంది. చెంగున లేడి పిల్లలా గంతేశాడు. ఎడమకాలు కంపార్ట్‌మెంట్ మెట్ల మీద పడింది. పట్టుకునేందుకు చేతికేమీ అందలేదు. కాలు జారింది. పట్టు తప్పింది. కన్నుమూసి తెరిచేలోగా కుడికాలు రైలు చక్రాల కానింది. మిగతా శరీరం ప్లాటుఫారమ్మీద పడిపోయింది. కంపార్ట్‌మెంట్ నిర్దాక్షిణ్యంగా లాక్కెళ్ళుతోంది.

"అమ్మా... " హరీష్ అరుపు. స్టేషన్ దద్దరిల్లింది. మరునిమిషంలో వదిలేసింది.

గుంపు... చుట్టూ జనాల గుంపు... రక్తం... ప్లాటుఫాం మీద రక్తం... హరీష్ ఒళ్ళంతా గాయాలు, నుదురు, నోరు, చేతులు... అంతా రక్తం. ఫ్లాట్‌ఫాం చివర్లో పడిపోయాడు హరీష్. కొట్టుకుంటున్నాడు.

"ప్లీజ్... దయచేసి రక్షించండి...." దీనాలాపన.

శక్తినంతా కూడదీసుకోగా ఎడమకాలు పైకి లేచింది. కుడికాలు ససేమిరా అంది. అది మోకాలు వద్ద విరిగి పట్టాలవైపు వేళ్ళాడ్తోంది.

జనాలకంతా కనబడుతోంది. ఇటు హరీష్‌ను చూస్తూ అటు మోహాలు చూసు కుంటున్నారు.

"అయ్యో పాపం ... యువకుడే !" ఓ నోరు బార్లా తెరుచుకుంది.

"అరెరే... లేపండి... హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి..." ఓ గుండె వణుకు.

"అమ్మో పోలీస్ కేసవుతుంది..." మరో గుండె దడదడ.

"ఏమన్నా అయితే పోలీస్ స్టేషన్ చుట్టూ, లీడర్ల చుట్టూ, కోర్టు చుట్టూ తిరిగి చావాలి..."

"పుణ్యం బదులు పాపం చుట్టుకుంటుంది".

నాలుగు నాలుకలు పది రకాలుగా మాట్లాడుతున్నై.

"అయ్యా... మీకు దండం బెడ్తా..." హరీష్ చేతులు జోడించబోయి విఫలుడయాడు. "నన్ను వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్ళండయ్యా ! నేను మిల్ట్రీ మనిషినయ్యా... యుద్ధ విమానాలు నడుపుతానయ్యా... లీవుల్లో వస్తున్నాను" కళ్ళల్లోని హరీష్ ప్రాణం కడుదీనంగా దేవెరిస్తోంది.

"అయ్యో పాపం ! ఆసుపత్రి దగ్గరనే ఉంది గదా. తీసుక పోండ్రి ఎవరన్నా..." ఓ వృద్ధుని యాచన. ఎవరూ పలుకలేదు.

క్షతగాత్రుడు హరీష్ శక్తులన్నీ ఆవిరైపోతున్నై.

"నాక్కా... కాలు విరిగింది కాని బతికే ఉన్నాను. నన్ను లేపండీ. అమ్మో... ఎడమ చెయ్యి మొమ్మొ... మొద్దుబారి పోతోంది... గాయాలు... రక్తం.... ప్లీజ్.. పుణ్యం కట్టుకోండి..." మాటలందరికీ వినబడుతున్నై.

అప్పటిదాకా ప్రేక్షకుడిగా చూస్తున్నాడు స్టేషన్ మాస్టర్.

... ఎటు పొయ్యి ఎటొస్తుందో... ఇంతా జరిగితే నీకేమీ తెలీనట్టుగా ఎందుకున్నావని ఎవరన్నా అడగొచ్చు ఎంక్వైరీలో...

"ఏమైంది ... యామైందీ ?" అప్పుడే చూసినట్టు గుంపులోంచి వచ్చాడు. పరిస్థితి ప్రమాదకరంగా కన్పించింది. మొహమ్మీది ముచ్చెమటలు బిందురూపం దాల్చి నుదుటి మీద మెరుస్తున్నై. గాలికిపోయే కంపను వేలికెందుకు తగిలించుకోవాలి ?

"ఉండండుండండి... పోలీసులకు ఫోన్ చేస్తా !" గుండెలు బాదుకోవాలన్పించింది. గబగబా వెళ్ళి పోయాడు.

రైలు స్టేషన్ ఫోను... పోలీస్ స్టేషన్‌ను పలుకరిస్తోంది. సెంట్రీ ఎత్తాడు ఫోను. స్టేషన్ మాస్టర్ చెప్పిందంతా బుద్ధిగా వింటూ ఊ కొట్టాడు - అదేదో నానమ్మ కథ వింటున్నట్టు.

"సర్సరే... హెడ్డుకో యస్సైకో చెప్తాలే..." పోలీస్ స్టేషన్ ఫోన్ కట్. స్టేషన్ మాస్టర్ చెవి గూడ ఫట్. అయినా తృప్తిగా నిట్టూర్చాడు. "నా డ్యూటీ నేను చేశాను" గొణుక్కున్నాడు.

"మధ్యాహ్నానికల్లా ఈ సరుకులు తేకపోతే ఈ రోజు భోజనముండదు" డ్యూటీకొచ్చే ముందు భార్య వార్నింగిస్తూ జాబితా జేబులో కుక్కిన సంగతి గుర్తుకొచ్చింది.

"మైగాడ్" నుదుటి చెమటలు చేతి గుడ్డతో అద్దుకున్నాడు. ఇంకో రెండు గంటల దాకా ట్రెయిన్సేవీ రావు, పోవు. ఈలోగా మ్యాటర్ దానంతటదే సెటిలవుతుంది. సరుకులు కొని ఇంట్లో ఇచ్చేసొస్తా ! ఒక్క దెబ్బకు రెండు పిట్టలు... ఆనందం. తనను తాను మెచ్చుకుంటూ బయటి కొస్తున్నాడు. బయట గల్లీ లీడర్ గాలయ్య కన్పించి "నమస్కారం సార్ !" బాణం వదిలాడు.

మూడు ముక్కల్లో ప్రమాదం సంగతిచెప్పేసి "పాపం ! దేశ రక్షకుడు... సాయం చెయ్యండీ..." అంటూ - ఎవరో తరుముకొస్తున్నట్టు వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

"అరెరే... !" గాలయ్య జాలి గుండె బేజారైంది.

"అయ్యో పాపం ! ఎంత పనైంది బ్రదర్ !" హరీష్ దగ్గరకెళ్ళి గుండెలు గుద్దుకున్నాడు గాలయ్య.

ఒళ్ళంతా నొప్పులు... సూదులతో పొడిచినట్టుంది హరీష్‌కు. గొంతు తడారిపోతోంది. కళ్ళతో సైగ చేశాడు. గాలయ్యకర్థం కాలేదు.

"ఓ షోడా పట్రండిరా !" కేకేశాడు గాంధీటోపి సర్దుకుంటూ. గాలయ్య ఆదేశం అదే క్షణంలో అక్షరాలా అమలైంది.

షోడాబుడ్డి కీచ్‌మంది. హరీష్ గొంతు తడైంది.

"బ్రదర్ ! మీరు ప్రజానాయకుల్లాగున్నారు. న్న... నన్ను రక్షించండి. లేవలేక పోతున్నాను..." చేతులు జోడించాలనే ప్రయత్నం విఫలమైంది.

"యస్ బ్రదర్ ! ప్రజాసేవయే నాకు పరమార్థం. సాటి మనిషిని ఆదుకోలేని మనిషి జన్మమెందుకూ ?.." ఉపన్యాసం ప్రారంభించబోయాడు. "ఊ ఇంక చాల్లేవయ్యా !" ఎవరో నిరసన వ్యక్తం చేశారు.

"దేవుడిలా వచ్చారు బ్రదర్ !" హరీష్‌లో ఆశ.

"వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్ళండిహ ... !"

"అవును తీసుకెళ్ళాలి. లేకపోతే నేనేమన్నా డాక్టర్నా ..." ఉపన్యాసం కోసం మరో ఛాన్సు వెతకబోయాడు.

"కాదు... యాక్టర్వు..." గుంపులోంచి ఎవరో గోవిందం.

సర్దుకున్నాడు గాలయ్య. "ఇదే యుద్ధములో గాయపడితే పుణ్యం పురుషార్థం దక్కేది..." వెకిలి నవ్వు.

హరీష్ నరాల్లో బాధ అధికమైంది. ఇన్నాళ్ళు బతికి ఇంటెనక చచ్చినట్టయిందే ... !

"ప్లీజ్ ... త్వరగా తీసుకెళ్ళండీ !"

"తీసుకెళ్ళొచ్చు" గాలయ్య ఖాదీ ధోతి సవరించుకున్నాడు. "కానీ... డబ్బులు కావాలి గదా !" మొహమ్మీది గరుత్మంతుని రెక్కలు కొట్టుకు లాడినై. జేబులు తడుముకున్నాడు...

'ఛ నీయవ్వ ! టయానికి డబ్బులుండి చావవు. నా ఇంటి ఇల్లాలికెన్నోసార్లు చెప్పాను జేబుల్లోంచి డబ్బులు తీయొద్దని... ఏం లాభం ? నిలువు దోపిడి చేసి పారేసింది." తనను తాను చీదరించుకుంటూ తలబాదుకున్నాడు.

"డడ... డబ్బులు నా దగ్గరున్నై" హరీష్ కుడి చెయ్యి పాంట్ జేబులో కెళ్ళింది.

పర్సుకు రెక్కలొచ్చి గాలయ్య చేతిలో వాలింది.

"అందులో రెండువేల పైగా రూపాయలున్నై బ్రదర్ ! హాఁ... మీ సాయం మరిచిపోలేను బాబూ !" చెంపలు తడుముకున్నాడు కుడిచేత్తో. అరచేతికి రక్తం అంటింది.

"ఆహా ! తప్పకుండా !" పర్స్ విప్పి చూశాడు గాలయ్య. కళ్లు జిగేల్ మన్నై. "క్షణంలో అంబులెన్స్ పట్టుకొస్తా" పరుగులాంటి నడకతో - ధోవతి కుచ్చిళ్ళను ఎడమ చేత్తో పట్టుకుని వెళ్ళిపోయాడు.

అంతా చూస్తున్నాడు బిచ్చగాడు. వాడు ఒంటి కన్ను బిచ్చగాడు. నడుమ్మీద మూరెడు గుడ్డ తప్ప శరీరమ్మీదెక్కడా అచ్ఛాదన లేదు.

"పావల కావలా పావల పైసలు కావాలా..." పాడుకుంటూ నవ్వుకుంటున్నాడు. జనాల్లోంచి హరీష్‌ను చూస్తున్నాడు. చేతిలోని బొచ్చెను డప్పుగా వాయిస్తూ పాడుకుంటున్నాడు.

జనాకదేమీ నచ్చలేదు. గుర్రుగా చూస్తున్నారు.

"నాది నాదంటావు నా ప్రాణమంటావు

నీదెక్కడున్నదే చిలకా ..." మరో పాటందుకున్నాడు.

"నీకు గట్లనే వుంటదిరా గుడ్డినా కొడకా !"

"బుడ్డగోచి బాడ్కావ్‌కేం దెలుస్తుందిలే లోకం పోకడ"

"నాల్గు పోలీసు దెబ్బలు పడితే తెలుస్తుంది" జనాల విసుర్లు, వ్యాఖ్యానాలు. అంతా అంబులెన్స్ కోసం చూస్తున్నారు. కొందరు జారుకుంటున్నారు. మరి కొందరు కొత్తగా వచ్చి విషయం కనుక్కుంటున్నారు. బిచ్చగాడు హరీష్ పక్కనున్నాడు.

"అనుకున్న దొక్కటీ అయేది ఒక్కటీ...

బోల్తా కొడుతుందిలే బుల్ బుల్ పిట్టా..."

బిచ్చగాని పాట... ఓ పెద్ద మనిషికి కోపమొచ్చింది.

"తన్నుంఁడిరా ముండాకొడుకును" అంటూ ముందుకొచ్చాడు.

"అరే... ఓ దేశభక్తుడు ప్రమాదానికి గురై అల్లాడి పోతుంటే... పోలీసోల్లు రారు, ఆటో రాదు, అంబులెన్స్ రాదు. పైగా నువ్వోకటారా లంజా కొడుకా..." బిచ్చగాని రెక్కలు పట్టుకుని దూరంగా లాక్కెళ్ళాడు. వాడినక్కడ వొదిలేసి తన దారిన తాను వెళ్ళాడు.

"ఓఫ్... పొద్దెక్కిందో లేదో... ఎండమండిపోతుంది. నీయవ్వ... ఏమైందబ్బా...." హెడ్ కానిస్టేబుల్ - కాళిందిలోంచి కృష్ణపరమాత్మలా ప్రత్యక్షమయ్యాడు.

"హమ్మయ్య... వచ్చారా ...!" హరీష్ పంచప్రాణాలు గొంతులో కొచ్చినై. "నేను... మిస్త్రీ మనిషిని సార్... నన్ను ముందు హాస్పిటల్‌కు చే... చేర్పండి" కళ్ళు బైర్లు కమ్ముతున్నె.

"సర్సరే..." ఎర్రటోపి తీసి లాఠీతో తలనొక్కుకున్నాడు హెడ్డు. "మరి ... పంచనామా రాయాలిగదా!" చుట్టూ కలియజూశాడు.

వచ్చేవాళ్లొస్తున్నారు, పోయేవాళ్లు పోతున్నారు. కొంతమంది గుడ్లప్పగించి చూస్తున్నారు.

"ఓర్నియవ్వ... ఓ దిక్కు ఆయన ప్రాణాలు పోతున్నాయంటే గదేంది ?" ఓ యువకునికి కోపమొచ్చింది. "పంచనామ తర్వాతాయె, ముందు హాస్పిటల్‌కు పోనీ."

హెడ్ కానిస్టేబుల్ ముఖారవిందము ముకుళించుకొంది. ఎర్రటోపి గుర్రుమంటోంది.

"హాస్పిటల్‌కు నువ్వు తీస్కపోవచ్చుగదా !" సవాలు విసిరాడు.

"మరి పోలీసులేం జేస్తరటా ! జెజ బొమ్మలోలె చూస్తుంటారా ?"

"ఏయ్ ! నేనెవలనుకున్నవ్ ?" రోషం పొడుచుకొచ్చింది. కనుగుడ్లు ముందుకొచ్చినై. పెదాలు బిగుసుకున్నె. లాఠీ గాల్లోకి లేచింది.

"ఏయ్... కొడతావా ... కొట్టు చూస్తా..." ఛాతీ గట్టి పడింది.

"నీయవ్వ... అసలు సంగతి ఇడిచి పెట్టి కుక్కలోలె కొట్లాడుకుంటున్నారు" ఒంటి కన్ను బిచ్చగాడు రెచ్చిపోయిండు. హెడ్డు బుర్ర గిర్రుమంది.

ఈ మిస్త్రీనా కొడుకును ఆటోల తీసుకపోవాలె. తోవల పుటుక్కున చస్తే... అమ్మో... సస్పెన్షన్... ఎంక్వైరీ... నా చావుకొస్తుంది. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు... సుమతీ శతక పద్యము మెదడులో తళుక్కుమంది. బుర్రమీసాలు సన్నగా కదిలినై.

"నేను వొయ్యి ఆటో దెస్తా. నువ్విక్కడనే ఉండు తమ్మి !" యువకుని భుజం తడిమి బయటికెళ్ళిపోయాడు.

"ఓర్నియవ్వ... గీ మనిషినే తీస్కపోయి ఆటోలెయ్యొచ్చుగదా !" ఒంటి కన్ను బిచ్చగాడు లొట్టకన్ను తడుముకున్నాడు.

"గదంతా నీకెందుకు బే ?" యువకునికి సుర్రుమంది.

జనాలు చెదిరిపోతున్నారు. ఇక్కడుంటే రేపు కోర్టులో సాక్ష్యం పలకాల్సి వస్తుందని చెదిరిపోతున్నారు.

హరీష్‌కు బాధ... పంచ ప్రాలు ఎగిరిపోతున్నంత నొప్పి... దేవుడా ... నువ్వే దిక్కు... మనసులో మొక్కుకున్నాడు.

"హాస్పిటల్ దగ్గరనే గదా ! ఆటో ఎందుకో !" కాలేజి కెల్తూ ఆగిన యువతి అడిగింది యువకుణ్ణి.

"మరి... ఇది క్రిమినల్ కేసు గదా ! పోలీసులే తీస్కపోవాలె ఆఁ".

"మనవే తీసుకెల్తే ఏమవుద్దటా ?" ఒంటిరాయిముక్కు పుడక తళుక్కుమంది. పుస్తకాలు గుండెలకు హత్తుకుంది.

"ఏమన్నా అయితే పోలీసు జులుం భరించాలె. స్టేషన్ల పడేసి బొక్కలిరగ్గొడ్తరు. కోర్టు చుట్టూ ప్రదక్షిణలు చెయ్యాలె... వేలు ఖర్చు చేసి బెయిల్ దీసుకోవాలె....

"అట్లనుకుంటే ఎట్లా ...?"

వాళ్ళ వాదులాట సాగుతూనే వుంది.

బిచ్చగాడి బొచ్చె నేల మీద పడింది. హరీష్‌ను అమాంతం లేపి భుజమ్మీదేసుకున్నాడు.

"గుడ్డిమాలోకంల ఎడ్డినా కొడుకులు... పాపం పుణ్యం దెల్వదురా దేవుడా..." గొణుక్కుంటూ ఒంటికన్నుతో దారి వెతుక్కుంటూ జనాలను తప్పుకున్నాడు. ముందుకు మరింత ముందుకెల్తూ... ఐదారు నిమిషాల్లో హాస్పిటల్ చేరుకున్నాడు.

విక్రమార్కుని భుజమ్మీద బేతాళుని దృశ్యం ... టీవీలో ప్రసారమైన బేతాళ కథలు గుర్తుకొచ్చి వింతగా చూస్తున్నారంతా.

**4 మార్చి, 2002**
**'జాగృతి' వారపత్రిక లో**
**ప్రచురితమైంది.**

